# ఆషాఢం సేల్

## శ్రీ వారాహి సిల్క్స్

కంచిపట్టు
(5000లకు పైగా డిజైన్స్)

ధర్మవరం పట్టు
(2500లకు పైగా డిజైన్స్)

మంగళగిరి పట్టు
(5000లకు పైగా డిజైన్స్)

ఉప్పాడ పట్టు
(2500లకు పైగా డిజైన్స్)

బెనారస్ పట్టు
(2500లకు పైగా డిజైన్స్)

కుబేర పట్టు
(5000లకు పైగా డిజైన్స్)

ఆర్గంజి పట్టు
(2000లకు పైగా డిజైన్స్)

కేటలాక్ శారీస్
(2000లకు పైగా డిజైన్స్)

ఫ్యాన్సీ శారీస్
(5000లకు పైగా డిజైన్స్)

డిజైనర్ శారీస్
(5000లకు పైగా డిజైన్స్)

వర్క్ శారీస్
(2500లకు పైగా డిజైన్స్)

ప్యూర్‌సిల్క్
(5000లకు పైగా డిజైన్స్)

ప్రింటెడ్ సిల్క్
(2000లకు పైగా డిజైన్స్)

లంగావోణీ సెట్‌లు
(2000లకు పైగా డిజైన్స్)

లెహంగాస్
(2000లకు పైగా డిజైన్స్)



**రూ.5000/-
షాపింగ్ చేయండి..**




**వెండి కాయిన్
పొందండి.**

కృష్ణాపార్క్ దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం




సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 9-7-2025
సంపుటి: 21 సంచిక: 91
పేజీలు: 8 వెల: రూ.1

# ప్రాణం ఖరీదు రూ.4 లక్షలు?!










- బుడితి సామాజిక ఆస్పత్రిలో వికటించిన సిజేరియన్
- రిమ్స్‌కు తరలించి చికిత్స అందించినా ఫలితం శూన్యం
- ఇద్దరు బాలింతలు మృతి.. బంధువుల ఆందోళన
- ఆ తల్లుల ప్రాణాలకు రేటు కట్టిన పోలీసులు, పెద్దలు
- ఇద్దరి కుటంబాలకు రూ.8 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం
- ఆందోళన విరమించి మృతదేహాలను తీసుకెళ్లిన బంధువులు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఇప్పుడే ఈ లోకంలోకి అడుగుపెట్టిన పసిగుడ్డుల ప్రాణాలకు పెద్దలనే షరాబులు ఖరీదు కట్టారు. ఇంకా కళ్లు తెరవకముందే తమ తల్లులను కోల్పోయిన ఆ అభాగ్యులను.. తల్లిలేని బిడ్డలుగా మిగిల్చిన వైద్యుల నిర్లక్ష్యాన్ని కరెన్సీ నోట్లతో మాఫీ చేసేశారు. పండంటి బిడ్డకు జన్మనివ్వాలని.. వారి చేత అమ్మా.. అనిపించుకోవాలన్న కోటి ఆశలతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఇద్దరు గర్భిణులు బిడ్డలకు జన్మనివ్వగలిగినా.. వారి ముద్దు మురిపాలు అనుభవించకుండానే ప్రసవ సమయంలోనే మృత్యుఒడికి చేరుకున్నారు. నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని సారవకోట మండలం బుడితి సామాజిక ఆస్పత్రి వైద్యురాలు శోభారాణి నిర్లక్ష్యం కారణంగానే సిజేరియన్ వికటించి ఇద్దరు బాలింతలు మృతి చెందారని బాధిత కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ సారవకోట పోలీస్ స్టేషన్ వద్ద బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ తరుణంలో వివాదాన్ని బేరసారాలతో కేసు లేకుండా మాఫీ చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఇదీ జరిగింది

జలుమూరు మండలం యలమంచిలి పరిధిలోని కామేశ్వరరావు పేటకు చెందిన పట్ట అరుణ(21)కు విశాఖపట్నం పైడిమాంబ కాలనీకి చెందిన గోవింద రావుతో రెండేళ్ల క్రితం వివాహమైంది. నెలలు నిండిన ఈమె ప్రసవం కోసం కన్నవారింటికి వచ్చింది. అలాగే పాగోడు గ్రామానికి చెందిన కొర్లాపు ధనలక్ష్మి (22)కి ఆమదాలవలస మండలం మెట్టక్కివలసకు చెందిన ఢిల్లీశ్వరరావుతో

- మిగతా చివరి పేజీలో

# పాపం పండింది.. పదవి ఊడింది!


అంబటి.. చిరుగుతుందా చీటీ!


- డీసీసీ అధ్యక్ష పదవి నుంచి అంబటి తొలగింపు
- పార్టీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు
- సీనియర్లు, ఇతర నేతలను పట్టించుకోకుండా ఏకపక్ష ధోరణి
- పీసీసీ అధ్యక్షురాలినే మాయ చేసేందుకు యత్నించిన ఫలితం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అనుకున్నట్లే అయ్యింది. తనను అందలం ఎక్కించిన పార్టీకే సున్నం రాయడానికి ప్రయత్నించిన జిల్లా కాంగ్రెస్ (డీసీసీ) అధ్యక్షుడు అంబటి కృష్ణారావు పదవి ఊడింది. ఆయన్ను తొలగిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం జారీ చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలోని సీనియర్లను పట్టించుకోకపోవడమే కాకుండా పార్టీ కార్యాలయం ద్వారా వచ్చే అద్దెలు, ఇతర నిధులు గుటుక్కుమనిపించడం, కార్యాలయ ఉద్యోగుల జీతాలకు కూడా ఎగనామం పెట్టడం ద్వారా డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు తీవ్ర అవినీతికి, క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడ్డారని గత నెలలో ఆరోపణలు వచ్చాయి. గతంలో ఈ వ్యవహారాలపై 'సత్యం' పత్రికలో కథనం ప్రచురితం కావడంతోపాటు కాంగ్రెస్ నేతల నుంచి పలు ఫిర్యాదులు కూడా రాష్ట్ర నాయకత్వానికి అందాయి.

### పీసీసీ అధ్యక్షురాలికే నేరుగా ఫిర్యాదులు

జిల్లాలోని పార్టీ సీనియర్లను ఏమాత్రం పట్టించుకోని అంబటి కృష్ణారావు.. సాక్షాత్తు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలను కూడా మాయచేసేందుకు ప్రయత్నించి ఆమెకే దొరికిపోయారు. గత నెల 20న షర్మిల జిల్లా పర్యటనకు వచ్చారు. ఆమె పర్యటన, సమావేశం ఏర్పాటు చేసిన విషయాన్ని క్యాడర్‌కే కాదు.. కనీసం జిల్లాలోని సీనియర్ నేతలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకైనా చెప్పకుండా కొందరు కిరాయి మనుషులతో మేనేజ్ చేసేయాలని అంబటి ప్రయత్నించారు. కానీ సమావేశం పూర్తికాకముందే తమకు డబ్బులు ఇస్తే వెళ్లిపోతామని పెయిడ్ ఆర్టిస్టులు గోల పెట్టడంతో సమావేశం రచ్చగా మారింది. దాంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ షర్మిల వెళ్లిపోయారు. కాగా ఇదే సందర్భంగా ప్రైవేట్ వ్యక్తులు కూడా డీసీసీ అధ్యక్షుడి మోసాలపై షర్మిలకు ఫిర్యాదుచేశారు. తమకు భూమి అమ్ముతానంటూ చాలాకాలం క్రితం అంబటి


Email ID: apccysshamilareddy@gmail.com
Ph No :9704333971

ANDHRA PRADESH CONGRESS COMMITTEE
ANDHRA RATNA BHAVAN, VIJAYAWADA - 520 002.

YS.SHARMILA REDDY
PRESIDENT

తేది: 09-07-2025
విజయవాడ

శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు శ్రీ అంబటి కృష్ణారావు గారిపై జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నిధులను దుర్వినియోగం చేస్తున్నట్లు పలు ఆరోపణలు మా దృష్టికి వచ్చినవి. ఈ అంశంపై పూర్తి విచారణ జరిపిన పిమ్మట శ్రీ అంబటి కృష్ణారావు గారు పార్టీ నిధులను దుర్వినియోగం చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలు నిజమేనని నిరూపితమైనవి.

జిల్లాలో ఒక బాధ్యతాయుతమైన పదవిలో వున్న వ్యక్తి పార్టీ నియమావళికి విరుద్ధంగా ఇటువంటి దుర్వినియోగానికి పాల్పడటం తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. ఈ నేపథ్యంలో శ్రీ అంబటి కృష్ణారావు గారిని తక్షణమే శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుండి తొలగించడమైనది.

శ్రీ అంబటి కృష్ణారావు గారిపై తీసుకోవలసిన క్రమశిక్షణా చర్యలపై మరింత లోతుగా విచారణ జరపవలసినదిగా రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘాన్ని ఆదేశించడమైనది.

వైఎస్ షర్మిలా రెడ్డి
అధ్యక్షులు, ఏపీసీసీ



తమ వద్ద డబ్బులు తీసుకున్నారని, కానీ ఇంతవరకు భూమి లేదు.. డబ్బులూ తిరిగి ఇవ్వలేదని.. అడిగితే మీ పేరు చెప్పి బెదిరిస్తున్నారని' గార మండలానికి చెందిన దంపతులు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకే ఫిర్యాదు చేశారు.

ఇక పార్టీ నిధుల నుంచి రూ.15లక్షల వరకు మాయమైనట్లు అప్పట్లోనే షర్మిలకు ఫిర్యాదుఅందింది. ఇందిరా విజ్ఞాన్ భవన్ ఆవరణలో ఉన్న షాపులు, కల్యాణమండపం నుంచి ప్రతి నెలా అందుతున్న అద్దెలను ట్రస్ట్‌కు చెందిన జాయింట్ ఖాతాలో వేయకుండా అంబటి తన సొంతానికి వాడుకున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. కాగా అంబటి కృష్ణారావు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లా పార్టీ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలివ్వడం లేదని, పేపర్ బిల్లులు చెల్లించడం లేదని, వస్తున్న అద్దెల సొమ్ము ఏమవుతుంతో తెలియడం లేదని పలువురు షర్మిలకు ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాలపై ఆమె అసహనం వ్యక్తం చేస్తూ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని, డీసీసీ అధ్యక్షుడిని మారిస్తే తప్ప పరిస్థితి మారేట్లు లేదని వ్యాఖ్యానిస్తూ వెళ్లిపోయారు. మరోవైపు అంబటి వచ్చిన తర్వాత జిల్లా కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలను పలువురు నేతలు షర్మిలకు పూసగుచ్చినట్లు వివరించారు. ఈ ఫిర్యాదులతోపాటు స్వయంగా చేదు అనుభవం ఎదుర్కొన్న షర్మిల పీసీసీ స్థాయిలో వాటిపై విచారణ జరిపించారు. పార్టీ నిధులను, పదవిని అంబటి కృష్ణారావు దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ కావడంతో అతన్ని డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నట్లు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సంతకంతో జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనపై మరింత లోతుగా విచారణ జరిపిన తర్వాత క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటామని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. అయితే అంబటి స్థానంలో ఇంకా ఎవరినీ డీసీసీ అధ్యక్షుడిగా నియమించలేదు.

# రెడ్‌క్రాస్‌కు ఉత్తమ సేవా పతకం

### గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్న కలెక్టర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఉత్తమ సేవా పతాకాన్ని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అందుకున్నారు. విజయవాడలో బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్‌క్రాస్ వార్షిక సర్వ సభ్య సమావేశంలో ఈ అవార్డులను ఆయన అందుకున్నారు. శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్ ద్వారా జరుగుతున్న విస్తృతమైన సేవలకు ఈ బంగారు పతకాన్ని స్వీకరించారు. 2022-23 సంవత్సరంలో ఉత్తమ జిల్లా పురస్కారాన్ని రెడ్‌క్రాస్ జిల్లా ట్రెజరర్ కె.దుర్గాశ్రీనివాస్ స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ వై.డి.రామారావు, వైస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, సెక్రెటరీ ఎ.కె.పరీడా, కోశాధికారి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.




# మా స్థలంలో పక్కింటివారి దౌర్జన్యం

- గీతా ప్రచార సమాజం ప్రతినిధుల ఆరోపణ
- విరాళంగా దక్కిన స్థలం ఆక్రమణకు యత్నాలు
- అడిగిన వారిపై దౌర్జన్యం, దుర్భాషలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు.. చర్యలు తీసుకోవాలని వినతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దాతలు తమకు విరాళంగా ఇచ్చిన స్థలంలో, దాన్ని అనుకుని ఉన్న కుటుంబీకులు చెత్తా చెదారాలు పారబోస్తూ, దాన్నో చెత్తకుండీలా మార్చేయడమే కాకుండా తమకు దఖలుపడిన స్థలంలో నిర్దేశిత నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నారని నగరంలోని బొంతావారి వీధికి చెందిన గీతా ప్రచారక సమాజం ప్రతినిధులు ఆరోపించారు. ఈ మేరకు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ కూడా అయిన జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అందులోని వివరాల ప్రకారం.. స్వర్గీయ అంధవరపు తవుడు, ఆయన కుటుంబ సభ్యులు తమ ఆస్తిలో భాగమైన టౌన్ సర్వే నెం.37లోని ఆర్.ఎస్. నెం.182/120లోని మూడున్నర సెంట్ల స్థలాన్ని 2017 అక్టోబర్ 31 తేదీన గీతా ప్రచారక సమాజం సొసైటీ పేరుతో శ్రీకాకుళం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ నెం. 288/2015 రిజిస్టర్ చేయించారు. ఆ స్థలంలో అన్నప్రసాద వంటశాల, భక్తుల కోసం టాయిలెట్లు నిర్మించాలన్న స్థలదాతల ఆకాంక్ష మేరకు నిర్మాణాలు చేపట్టేందుకు సమాజం ప్రతినిధులు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే సమాజానికి చెందిన శ్రీకృష్ణ మందిరానికి అనుకుని తూర్పు వైపు ఉన్న ఒక కుటుంబానికి చెందినవారు అభివృద్ధి పనులు చేపట్టడానికి వీల్లేకుండా ఆ స్థలంలో చెత్త, వ్యర్థాలు పారబోస్తున్నారు. నిర్మాణాలు చేపట్టినా ఆ కుటుంబ యజమాని, ఆయన కుమారుడు వాటిని కూలదోస్తూ గీతా ప్రచార సమాజం (శ్రీకృష్ణ మందిరం) ప్రతినిధుల పట్ల దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తూ శారీరక, మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. సమాజం చేపట్టే ధార్మిక, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలకు అవాంతరాలు కల్పిస్తున్నారు. సమాజం సభ్యులందరూ వృద్ధులే.. అయినా ఏమాత్రం కనికరం లేకుండా దారుణంగా వ్యవహరిస్తున్నారు. స్థలాన్ని ఆక్రమించుకోవాలని దురాశతోనే వీరు చేస్తున్న దౌర్జన్యాలకు భయపడి స్థలదాత కుటుంబ సభ్యులు కూడా ఏమీ చేయలేక వెనుకంజ వేస్తున్నారు. ఈ విషయాలను పరిశీలించి దౌర్జన్యం చేస్తున్న కుటుంబంపై చర్యలు తీసుకుని గీతా ప్రచార సమాజం ఆస్తిని కాపాడటంతో పాటు సభ్యులకు రక్షణ కల్పించాలని ఆ వినతిపత్రంలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

• ఎడిటోరియల్

# అమరావతి రైతుల అభ్యంతరాలు

వైకాపా పాలనలో మూలనపడిన రాజధాని అమరావతి నిర్మాణం.. ఎన్డీయే కూటమి సర్కారు అధికారం చేపట్టిన తర్వాత మళ్లీ పట్టాలపైకి ఎక్కింది. దీనిపై ఉన్న రాజకీయ వివాదాలు, కొందరు నిపుణుల అభ్యంతరాలు పక్కనపెడితే ల్యాండ్ పూలింగ్ పేరుతో మళ్లీ మొదలుపెట్టిన భూ సమీకరణ వివాదాస్పదమవుతోంది. గతంలో చంద్రబాబు సర్కారు అధికారంలో ఉన్నప్పుడు నిపుణుల సూచనలు, హెచ్చరికలను పట్టించుకోకుండా ఏకపక్షంగా ఏటా మూడు పంటలు పండే అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా నిర్ణయించారు. అందుకోసం రైతుల నుంచి సారవంతమైన 34 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో సేకరించారు. భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యామ్నాయంగా నివాస స్థలాలు, భూమిని బట్టి కొంత జీవన భృతి చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల కాన్సెప్ట్‌ను తెరపైకి తెచ్చి అమరావతి కేవలం శాసన రాజధానిగా ఉంటుందని చెప్పి గత టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన పనులను మూలన పడేసింది. అయితే గత ఏడాది మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు రాష్ట్రానికి అమరావతే ఏకైక రాజధానిగా ఉంటుందంటూ.. పాత నిర్మాణ పనుల బూజు దులపడం మొదలుపెట్టింది. మరోవైపు అనేక సంస్థలకు ప్రభుత్వం వరుసపెట్టి భూములు కేటాయిస్తూ, ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. అదే సమయంలో అమరావతిని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని హంగులు అద్దాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. అందుకోసం అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, ఏఐ సిటీ, స్పోర్ట్స్ విలేజ్, అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలని ప్రతిపాదిస్తున్నారు. అలాగే నిర్మాణల కోసం ప్రపంచ బ్యాంకు, జర్మన్ బ్యాంకు, హడ్కో నుంచి వేల కోట్లు నిధులు రుణంగా తీసుకున్నారు. మారిన ప్రాధాన్యతల వల్ల ఇప్పటికే సేకరించిన 34 వేల ఎకరాలు సరిపోవంటూ మరో 44 వేల ఎకరాలు సేకరిస్తామంటూ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చింది. రాజధాని నిర్మాణానికి ఇప్పటికే సేకరించిన 34 వేల ఎకరాలే ఎక్కువని, ఇప్పుడు మళ్లీ దానికి మించి భూసేకరణ ఎందుకన్న విమర్శలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. అయినా ప్రభుత్వం వాటిని ఖాతరు చేయకుండా రెండో దశ భూ సమీకరణకు కేబినెట్ ఆమోదముద్ర వేయించుకుని రంగంలోకి దిగింది. భూసమీకరణ చేయాల్సిన ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహిస్తోంది. ఇక్కడే కొత్త సమస్య ఎదురవుతోంది. ఊహించని విధంగా రైతుల నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది. గతంలో ఇదే చంద్రబాబు పిలుపుతో రైతులు స్వచ్ఛందంగా 34వేల ఎకరాలను ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. కానీ ఇప్పుడు మాత్రం అమరావతి గ్రామాల్లో అదనపు భూ సమీకరణపై అభ్యంతరాలు, నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో గ్రామసభల్లో పాల్గొంటున్న మంత్రులు, ఆ ప్రాంత ఎమ్మెల్యేలు రైతులకు నచ్చజెప్పలేక సతమతం అవుతున్నారు. పదేళ్ల క్రితమే రాజధాని కోసం సేకరించిన భూములను అభివృద్ధి చేయకపోవడం, తమకు ప్లాట్లు, భృతి అందకపోవడం వంటి సమస్యలను ప్రస్తావిస్తున్న రైతులు మళ్లీ భూములు ఇచ్చి నష్టపోలేమని రైతులు తెగేసి చెబుతున్నారు. ఇప్పుడు మీరు భూములు తీసుకుంటే.. రేపు వచ్చే ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్న గ్యారెంటీ ఏమిటని నిలదీస్తున్నారు. ముఖ్యమంత్రి సూచన మేరకు గత గురువారం నుంచి మంగళగిరి, తాడికొండ, పెదకూరపాడు నియోజకవర్గాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి భూములు ఇస్తామంటూ ఈ సభల్లోనే తీర్మానం చేయాల్సి ఉంటుంది. అప్పుడే ప్రభుత్వం భూములు సేకరించగలుగుతంది. కొందరు రైతులు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు ఇస్తున్నప్పటికీ.. మెజారిటీ రైతులు మాత్రం భూములు ఇచ్చేదిలేదని మొండికేస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామసభలకు వచ్చిన మంత్రుల ముఖం మీదే చెప్పేస్తున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న జనసేన, బీజేపీలు అదనపు భూసమీకరణ విషయంలో మౌనం పాటిస్తుండటం గమనార్హం. గతంలో అమరావతి నిర్మాణానికి మద్దతుగా, రైతుల ఉద్యమాలకు అండగా నిలిచిన ఆ పార్టీలు ఇప్పుడు ప్రభుత్వంలో భాగస్వామి ఉన్నా కూడా రెండోదశ భూ సమీకరణపై స్పందించడంలేదు. కేబినెట్ ఆమోదముద్రతో ఆ పార్టీలు కూడా అంగీకరించినట్లు కనిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో రైతులను ఒప్పించడం, గ్రామసభల నిర్వహణలో ఒక్క తెలుగుదేశం మంత్రులు, ఎమ్మెల్యేలే పాల్గొంటున్నారు. జనసేన, బీజేపీ క్యాడర్ మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. దీంతో ఈసారి భూసమీకరణ అంత సులువేమీ కాదని, ఆ రెండు పార్టీలు కూడా కలిసివస్తే రైతులకు నమ్మకం పెరుగుతుందని అంటున్నారు.

## ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ చైర్మన్‌గా రవివర్మ



(సత్యంన్యూస్, పాతపట్నం)

పాతపట్నం ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ చైర్మన్‌గా మండలంలోని గంగుపేటకు చెందిన బండి రవివర్మ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో తనను గుర్తించి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతోపాటు, పలువురు నాయకులు రవివర్మకు అభినందనలు తెలియజేసారు.

## అఖిలభారత సమ్మెలో పెన్షనర్లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్మికులు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వ్యతిరేక విధానాలు విడనాడాలని, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం జరిగిన అఖిల భారత సమ్మెలో పెన్షనర్లు పాల్గొనారని పెన్షనర్ల ఐక్య వేదిక కన్వీనర్ మణికొండ ఆదినారాయణమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీసు వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతూ వేతన సవరణ సమయంలో పెన్షనర్లకు కూడా పెరుగుదల (అప్డేషన్) చేసే నియమాన్ని ప్రశ్నార్ధకం చేసే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వును ఉపసంహరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంస్థల పెన్షనర్ల సంఘాల నాయకులు చంద్రశేఖర్, వి.శ్యామ్, పి.సుధాకరరావు, పి.వాసుదేవ రావు, ఎస్ రమేష్, అన్నాజీభట్లు, ఏం గోవర్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.




## సమ్మె సందర్భంగా భారీ ర్యాలీ




(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వీ రమణలు మాట్లాడుతూ జిల్లాలో అటు పైడి భీమవరం నుంచి ఇటు ఇచ్ఛాపురం వరకు సమ్మె జయప్రదంగా జరుగుతోందన్నారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి ఒక హెచ్చరిక లాంటిదన్నారు. కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు నాలుగు లేబర్ కోడ్‌లుగా బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చి కార్మికవర్గానికి తీవ్రద్రోహం చేసిందని విమర్శించారు. దీనిలో భాగంగా ఫ్యాక్టరీస్, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాలు తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోనూ 8గంటల పని స్థానంలో 10 గంటల పనిదినంగా మార్పు చేసిందన్నారు. రక్షణ సౌకర్యాలు కల్పించకుండా మహిళలతో రాత్రి షిఫ్టులలో పనిచేయించుకునేందుకు యాజమాన్యానికి స్వేచ్ఛ ఇస్తూ, శ్రామిక మహిళల హక్కులను కాలరాస్తూ చట్టంలో సవరణలు తెచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అడుగుజాడల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్మికచట్టాల్లో తెచ్చిన సవరణలను రద్దు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపివేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, కౌలు రైతులకు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు నూతన కౌలుచట్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ చట్టం రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లు బిగించరాదన్నారు. కార్యక్రమంలో ఈ నాగార్జున అగ్రికమ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3, బోటలింగ్ నాయకులు పి.దుర్గాప్రసాద్, ఎం.గౌరీశంకర్, ఎం.సత్యనారాయణ, ఎన్.నాగేశ్వర్రావు, ఎల్.రామప్పుడు, ఎం.రమణ, డి.బంగార్రాజు, ఎన్.రమణ సి.హెచ్.సత్యనారాయణ, పి.శ్రీనుబాబు, ఎస్.దుర్గారావు, డి.కుమార్, ఎన్.రమణ, ఎ.పాపారావు తదితరులు పాల్గొన్నారు

## నిరాడంబరంగా పీఎంజే బాబు జన్మదిన వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పీఎంజే బాబు తన 74వ జన్మదిన వేడుకలు రాజాంలోని వృద్ధాశ్రమం వృద్దులు, మానసిక వికలాంగుల మధ్య జరుపుకున్నారు. వృద్దులకు నూతన వస్త్రాలు, మానసిక వికలాంగుల పిల్లలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా డోలపేట యువత కేక్ కట్‌చేసి సత్కరించారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో సత్యసాయి అన్నపూర్ణ అన్నదానం, టీడీపీ జిల్లా కార్యాలయంలో సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పమ్మి శారద, శ్రీను, రవి, ఆనంద్, నాయుడు, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.





## లేబర్ కోడ్ రద్దు చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లేబర్‌కోడ్ రద్దు చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, బిఏఎఫ్ఐ నాయకులు మండ శ్రీనివాసరావు, ఎల్ఐసి నాయకులు ఆచారి బుధవారం అన్నారు. అఖిల భారత జాతీయ సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక ఎల్ఐసి శ్రీకాకుళం శాఖ ఆవరణలో ధర్నా, నిరసన చేపట్టారు. ఏఐఐఈఏ, బిఏఎఫ్ఐ సంఘాల, సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, అసంఘటిత, సంఘటిత కార్మికులు పెద్దఎత్తున పాల్గొని, కేంద్ర ప్రభుత్వ విధానాలపై నినాదాలు చేశారు. అనంతరం బిఏఎఫ్ఐ నాయకులు మండ శ్రీనివాసరావు, ఎల్ఐసి నాయకులు ఆచారిలు మాట్లాడుతూ కార్మికులకు 10 గంటల పని రద్దు చేసి, 8గంటల పని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 16 డిమాండ్లు అమలు పరచాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రకాష్, బిఎస్ఎన్ఎల్ గోవర్ధన్, ఎల్ఐసి ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



తెలుగు సినిమా రంగంలో అత్యంత గౌరవనీయమైన నటులలో ఒకరిగా పేరొందిన వ్యక్తి. తన ఇంటిపేరు తో ప్రసిద్ధి చెందిన ఈ నటుడు, సహాయ నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, అప్పుడప్పుడు నిర్మాతగా తెలుగు చిత్రసీమలో తనదైన ముద్ర వేశారు. సుమారు ఐదు వందల చలనచిత్రాలలో నటించిన అతడు తన సహజమైన నటన, బహుముఖ పాత్రల పోషణ, మరియు అసాధారణమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన గుమ్మడి వెంకటేశ్వరరావు గారి జన్మదిన జ్ఞాపకం !

గుమ్మడి వెంకటేశ్వరరావు గారు 1927 జూలై 9న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలోని రావిపాడు గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గుమ్మడి రామయ్య, సీతారామమ్మ ఒక సాధారణ గ్రామీణ కుటుంబానికి చెందినవారు. చిన్నతనం నుండే సినిమా మీద ఆసక్తి కలిగిన గుమ్మడి, తన విద్యాభ్యాసాన్ని గుంటూరులో పూర్తి చేశారు. ఛాయాగ్రహణం (ఫోటోగ్రఫీ) పట్ల కూడా ఆసక్తి కలిగి ఉండేవారు, ఇది తర్వాత ఆయన సినిమా రంగంలోకి అడుగుపెట్టడానికి ఒక కారణంగా నిలిచింది.

### సినిమా రంగంలోకి ప్రవేశం.....

గుమ్మడి వెంకటేశ్వరరావు గారు సినిమా రంగంలోకి ప్రవేశించడం 1950లో విడుదలైన "అదిత్య 369" కాదు, కానీ "పుట్టిల్లు" (1950) చిత్రంతో జరిగింది. అయితే, ఆయనకు తొలి గుర్తింపు తెచ్చిన చిత్రం 1954లో విడుదలైన "తోడు దొంగలు" ఈ చిత్రంలో ఆయన నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది మరియు ఈ చిత్రం ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ చిత్రంలోని నటనకు గాను ఆయనకు రాష్ట్రపతి అవార్డు (ఇప్పటి జాతీయ చలనచిత్ర పురస్కారం) లభించింది, ఇది ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెట్టింది.

### ఆయన నటించిన కొన్ని ముఖ్యమైన చిత్రాలు:

1) మహామంత్రి తిమ్మరుసు (1962) : ఈ చిత్రంలో గుమ్మడి పోషించిన తిమ్మరుసు పాత్ర ఆయన కెరీర్‌లో ఒక మహత్తరమైన పాత్ర. ఈ చిత్రంలోని నటనకు కూడా ఆయనకు రాష్ట్రపతి అవార్డు లభించింది.

2) మాయాబజార్ (1957) : ఈ ఐతిహాసిక చిత్రంలో ఆయన బాలరాముడి పాత్రలో నటించారు, ఇది ఆయనకు ఎంతో పేరు తెచ్చింది.

3) పాతాళ భైరవి (1951), "మిస్సమ్మ (1955)" "కులగోత్రాలు (1962)", "మూగమనసులు (1964)" వంటి చిత్రాలు ఆయన నటనా వైవిధ్యాన్ని చాటాయి.

గుమ్మడి సినిమాలలో ఆయన పాత్రలు చాలావరకు కథను ముందుకు నడిపించే బలమైన స్తంభాలుగా నిలిచాయి. ఆయన సహజమైన నటన, డైలాగ్ డెలివరీ, మరియు భావోద్వేగ ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకునేవి.

# అసాధారణమైన స్క్రీన్ ప్రెజెన్స్!

### సినిమా ప్రస్థానం....

గుమ్మడి తన ఐదు దశాబ్దాల సినిమా కెరీర్‌లో సుమారు 500 చిత్రాలలో నటించారు. ఆయన ప్రధానంగా సహాయ నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పనిచేసినప్పటికీ, ఆయన పోషించిన పాత్రలు చిత్రంలో కీలకమైనవిగా ఉండేవి. ఆయన పాత్రలు సాధారణంగా గౌరవప్రదమైనవి, ఆధికారికమైనవి, లేదా భావోద్వేగ లోతును కలిగి ఉండేవి. రాజా, తండ్రి, గురువు, పెద్దమనిషి, లేదా విలన్ వంటి విభిన్న పాత్రలలో ఆయన తన నటనా సామర్థ్యాన్ని చాటుకున్నారు.

### అంతర్జాతీయ గుర్తింపు.....

గుమ్మడి వెంకటేశ్వరరావు తెలుగు సినిమాకు మాత్రమే పరిమితం కాలేదు. ఆయన 1978 మరియు 1982 సంవత్సరాలలో తాష్కెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు దక్షిణ భారతదేశం నుండి భారతీయ ప్రతినిధి బృందంలో అధికారిక సభ్యుడిగా పాల్గొన్నారు. ఈ ఫెస్టివల్‌లో ఆయన తెలుగు సినిమాను ప్రపంచ స్థాయిలో ప్రదర్శించడంలో కీలక పాత్ర పోషించారు.

### నిర్మాతగా:

నటుడిగా మాత్రమే కాకుండా, గుమ్మడి కొన్ని చిత్రాలను నిర్మించారు కూడా. ఆయన నిర్మించిన చిత్రాలు కూడా విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ఆయన నిర్మాణంలో ఉన్న చిత్రాలు కళాత్మకత మరియు సామాజిక సందేశాలకు ప్రాధాన్యత ఇచ్చాయి.

### వ్యక్తిగత జీవితం:

గుమ్మడి వెంకటేశ్వరరావు సాధారణ జీవనశైలిని అనుసరించేవారు. ఆయన సినిమా రంగంలో ఉన్నప్పటికీ, వ్యక్తిగతంగా నిరాడంబరంగా జీవించారు. ఆయనకు సినిమా పట్ల మక్కువతో పాటు, సాహిత్యం మరియు కళలపై కూడా ఆసక్తి ఉండేది. ఆయన తన సహనటులు, దర్శకులు, మరియు సినిమా రంగంలోని ఇతర సభ్యులతో ఎల్లప్పుడూ సౌమ్యంగా, గౌరవంగా వ్యవహరించేవారు. గుమ్మడి వెంకటేశ్వరరావు తెలుగు సినిమా రంగంలో ఒక బహుముఖ నటుడిగా, నిర్మాతగా, మరియు సినిమా ప్రేమికుడిగా తనదైన గుర్తింపు సంపాదించారు. ఆయన నటనలోని సహజత్వం, ఆయన పాత్రలోని లోతు, మరియు సినిమా పట్ల ఆయన అంకితభావం ఆయనను తెలుగు చిత్రసీమలో ఒక శాశ్వత ఆభరణంగా నిలిపాయి. ఆయన జన్మదినం సందర్భంగా, ఆయన సినిమా కృషిని స్మరించుకోవడం, ఆయన చిత్రాలను మళ్లీ చూడడం మనందరికీ ఒక గౌరవం.

- మహమ్మద్ గౌస్

### అవార్డులు మరియు గౌరవాలు.....

(1) రాష్ట్రపతి అవార్డు, "తోడు దొంగలు" (1954) మరియు "మహామంత్రి తిమ్మరుసు" (1962) చిత్రాలలో నటనకు.

(2) నంది అవార్డులు : తెలుగు సినిమాకు ఆయన చేసిన కృషికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి గౌరవం.

(3) తెలుగు సినిమా రంగంలో ఆయన సేవలకు గాను ఎన్నో సన్మానాలు మరియు గౌరవాలు.

మరణం: గుమ్మడి వెంకటేశ్వరరావు 2010 జనవరి 26న చెన్నైలోని తన నివాసంలో అనారోగ్యంతో మరణించారు. ఆయన మరణం తెలుగు సినిమా రంగంలో ఒక శూన్యతను సృష్టించింది. ఆయన సినిమాలు, నటన, మరియు ఆయన వ్యక్తిత్వం ఈ రోజు కూడా అభిమానులకు, సినిమా రంగంలోని వారికి స్ఫూర్తిగా నిలుస్తాయి.

## వృత్తి నిబద్ధతే గుర్తింపు తెస్తుంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం రూరల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత్రునివలసలో ప్రధానోపాధ్యాయులు పైడి సత్యనారాయణ అధ్యక్షతన బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వృత్తి నిబద్ధత వల్లే గుర్తింపు వస్తుందని, అటువంటి నిబద్ధత బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఉందన్నారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు ఐడివి ప్రసాద్, తెలుగు భాషోపాధ్యాయులు పిసిని వసంతరావు, వ్యాయామ ఉపాధ్యాయులు రాజనాల సతీష్ రాయుడు, హిందీ భాషోపాధ్యాయులు షాజది భాను, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గొటివాడ సుభద్రాదేవిలను, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, ప్రాథమిక పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రస్తుత విద్యార్థులు, పూర్వపు విద్యార్థులు కలిసి ఘనంగా సన్మానించారు.



## కార్మిక హక్కులకై ఉద్యమించాలి

(సత్యంన్యూస్, రణస్థలం)

కార్మిక హక్కులకై ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు అఖిలభారత సమ్మె చేపట్టిన కార్మికులు పైడిభీమవరంలో శ్యాంపిస్టన్స్, డా.రెడ్డీస్ లేబొరేటరీస్ వద్ద ఆందోళన నిర్వహించారు. రణస్థలంలో రామతీర్థం జంక్షన్ నుండి లావేరు జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను పోరాటాలు ద్వారానే రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎం.అప్పలనర్సయ్య, ఎం.కూర్మారావు, వి.లక్ష్మణరావు జయరాం, డి.ఎల్ ఎ.నాయుడు, ఎం.ఈశ్వరరావు, పి.రామకృష్ణ, బి.సురేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు అప్పమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.





సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా బుధవారం జేఆర్‌పురంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పర్యటించారు. కార్యక్రమంలో లంకా శ్యామ్, డీజీమ్ ఆనందరావు, కనకారావు, రాముడు, శ్రీనివాస్, ధనుంజయ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, రణస్థలం

## లేబర్ కోడ్లు రద్దు చేయాలి



(సత్యంన్యూస్, కొత్తూరు)

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ ఆపాలని స్కీం వర్కర్లని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మోటారు,ఆటో, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయాలని,కేంద్ర రాష్ట్ర ఉద్యోగ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కొత్తూరు మండల కేంద్రంలో స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుండి అంబేద్కర్ విగ్రహం వరకు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు భవిరి క్రిష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, కార్యదర్శి గంగరాపు సింహచలం, యస్.అనురాధ, ధనలక్ష్మి, జలజాక్షి, కె.జ్యోత్స్న, గౌరమ్మ, జయలక్ష్మి, బోడమ్మ, అమ్మాయమ్మ, పనస రమేష్, రామారావు, సత్యం, వెంకట్రావ్, ధనుంజయ, అప్పారావు, సూర్యనారాయణ, సింహచలం, శంకర్, నిమ్మక అప్పన్నలు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

(సత్యంన్యూస్, గార)

మండలంలోని సతివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్ళిన ఉపాధ్యాయులు పి.సుధాకర్, డి.వి.ఎస్.ప్రసాద్, పి.రాములమ్మలను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు ముద్దాడ గౌరీశంకర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఇటీవల ఈ పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేసి ఇదే పాఠశాలలో పదవీ విరమణ పొందిన గణిత ఉపాధ్యాయులు ఆర్.వి.రమణమూర్తి అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నిబద్ధతతో బోధించి క్రమశిక్షణ గల విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు లేని లోటు తీరనిదని, వారి సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులకు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన పీవీఎన్ మాధవ్‌ను ఎమ్మెల్యే ఎన్ఈఆర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు తదితరులున్నారు.

– సత్యంన్యూస్, ఎచ్చెర్ల

## కార్మిక చట్టాలు అమలు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్మికుల హక్కులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడిని కార్మికులంతా ఐక్యంగా తిప్పికొట్టాలని, కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయకపోతే పోరాటాలు తీవ్ర తరం చేస్తామని వామపక్ష నాయకులు పి.తేజేశ్వరరావు, టి.ప్రకాశ్, సి.హెచ్.గోవిందరావు, ఎం.క్రాంతి, టి.అరుణలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం డైమండ్ పార్కు నుండి ఏడురోడ్ల కూడలి వరకు మహాప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఆర్.ప్రకాశరావు, టి.తిరుపతిరావు, ఎం.గోవర్ధనరావ, ఎన్.బలరాం, ఎ.గణేష్, డి.వాసుదేవరావు, ఎన్. మహేష్, ఎ.కామేశ్వరరావు, బి.చిన్నారావు, ఆర్.చిన్నారావు, ఎం.సూర్యనారాయణ, పి.శ్రీనివాసరావు, జ్యోతిప్రసాద్, ఎం.నాగేశ్వరరావు, జగ్గారావు, కె.కళ్యాణి, జ్యోతి, అప్పలనర్సమ్మ, బుజ్జమ్మ, కాంచన, టి.ప్రవీణ, ఎం.ఆదినారాయణ మూర్తి, అప్పలరాజు పాల్గొన్నారు.



జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమములో ఉపాధ్యాయులు, బి.జనార్దనరావు, కె.శ్రీనివాసరావు, కె.నీలయ్య, సి.హెచ్.లక్ష్మీరాజ్యం, ఆర్.తులసీదాస్, సి.ఆర్.పి. అప్పన్న, యం.సత్యన్నారాయణ, టి.రమామణి, చిట్టిబాబు, శ్రీనివాస్, రామారావు, లక్ష్మీ, జ్యోతి, తులసి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## నేత్రదానం... జీవనదానం!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



అన్ని దానాల్లో నేత్రదానం మహోత్తరమైనదని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. తోటపాలెంకి గ్రామానికి చెందిన బి.వి.ఏ.ఎన్.ఆదిత్యన్ (84) మృతి చెందగా, కుటుంబసభ్యులు బి.వి.ఎస్.సాయిరామ్, వి.ఎస్.ఎస్.ఎల్.ప్రసన్న, ఎస్.తవిటయ్య ఆయన నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. సమాచారం అందుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు నేత్రాలను సేకరించి, విశాఖ ఎల్.వి.ప్రసాద్ నేత్రబ్యాంకుకు పంపించారు. దాత కుటుంబాన్ని రెడ్‌క్రాస్ అభినందించింది. అనంతరం మాట్లాడుతూ నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## గాయత్రి కళాశాలలో ఐ.టి. హకతాన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మునసబుపేట గురజాడ విద్యాసంస్థల గాయత్రి కళాశాలలో మూడు రోజుల ఐ.టీ హకతాన్‌ను కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ కేవీవీ సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు సాంకేతికతను అనుసరించి తమ కెరీర్‌ను ప్రణాళిక చేసుకోవాలని, దీనికి సంబంధించి ఫంక్షనల్ అనుభవాన్ని హ్యాకాథన్‌ల ద్వారా అనుభవజ్ఞుల ఆలోచనలు, సృజనను వెలికితీసే వేదికలను పంచుకోవాలన్నారు. కళాశాల కంప్యూటర్ విభాగ అధ్యాపకులను అభినందించారు. ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్ వేర్ సంస్థ స్పెజీ, గురజాడ విద్యా సంస్థలు సంయుక్త నిర్వహణలో జరుగుతున్న ఈ శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులకు వెబ్ డెవలప్మెంట్, సామాజిక మాధ్యమాలను ఉపయోగించడం, వ్యాపార విశ్లేషణ, ఇంటర్వ్యూలలో ఎలా విజయం సాధించాలి, రెజ్యూమ్ తయారీ, జాబ్ అవకాశాలు తదితర అంశాలలో మార్గదర్శనం చేయనున్నారన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు. కార్యక్రమంలో ఐ.క్యూ.ఏ.సి. సమన్వయకర్త డాక్టర్ మార్థండ కృష్ణ, మేజర్ వి.మహేష్, కంప్యూటర్ విభాగాధిపతి బాలసుందర్, రాజ్ కుమార్, మల్లేశ్వరరావు, సింహాచలం, స్పెజీ కంపెనీ ప్రతినిధులు సాయి మణికంఠ, లిఖిత, అక్షిత శ్రీరామ్, గంగోత్రి తదితరులు పాల్గొన్నారు.



## నరసన్నపేటలో సమ్మె బాట

(సత్యంన్యూస్, నరసన్నపేట)

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ ఆపాలని స్కీం వర్కర్లని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మోటారు, ఆటో, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నరసన్నపేటలో స్థానిక ఎండిఓ ఆఫీస్ జంక్షన్ నుండి ఆర్టిసి కాంప్లెక్స్ వరకు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సిఐటియు జిల్లా నాయకులు సత్యనారాయణ, ఆర్ సురేష్ బాబు, మండల కన్వీనర్ వై చలపతిరావు ఎలక్ట్రికల్ ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ తలసముద్రం మోహన్‌రావు, నీలరాజు, బి.రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి టి.లక్ష్మణరావు, బి.సూర్యనారాయణ, జి.బావాజీ, పి.సోమేశ్వరరావు, పి.సింహాచలం, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు ఇ.భాగ్యలక్ష్మి, టి.అమరావతి, ఎన్.పార్వతి, ఉష, రోహిణి, ఆర్.హేమలత, ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకులు ఐ.సంతోషి, జి.ఉష, కె.పద్మ, వి.లక్ష్మి, టి.లక్ష్మి, మధ్యాహ్నం భోజన పథకం మండల నాయకులు రాధ, కాంతమ్మ, రైతాంగం జిల్లా సహాయ కార్యదర్శి కే.కొండయ్య, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.మాధవరావు, సోమేశ్వరరావు, సుధీర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## విస్తృతస్థాయి సమావేశానికి తరలిరండి



(సత్యంన్యూస్, టెక్కలి)

ఈనెల 12న వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విస్తృతస్థాయి సమావేశానికి తరలి రావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు హనుమంతు వెంకటేశ్వర నాయుడు, టెక్కలి పట్టణ అధ్యక్షులు తమన్నాగారి కిరణ్‌లు కోరారు. ఈమేరకు టెక్కలి టౌన్‌లో నాయకులు కార్యకర్తలను కలిసి బుధవారం ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ వైకాపా జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పిలుపు మేరకు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమ నిర్వహణపై ఈనెల 12న నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశానికి వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వైకాపా నాయకులు కిల్లి అజయ్, శ్రీధర్‌రెడ్డి, గణపతి మేష్టారు, పిత రమణ బాబు, కార్తీక్, సోమేష్, రాజేష్, ఆవలి కృష్ణ, మామిడి కృష్ణ, అట్లా రవి, సింహాచలంలు పాల్గొన్నారు.

## విద్యార్థి ప్రగతికి చిత్రలేఖనం తోడ్పాటు

(సత్యంన్యూస్, రాజాం)

విద్యార్థుల చదువుల స్థాయి పెంపొందించేందుకు చిత్రలేఖనం ఎంతో దోహదపడుతుందని పాలఖండ్యాం ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయని ఆర్.ఎల్.కుమారి అన్నారు. విద్యార్థులలో అంతర్గతంగా దాగిన కౌశలాన్ని వెలికి తీసి వారిని ప్రోత్సహించిన ఎడల సత్ఫలితాలను సాధిస్తామని ఆమె అన్నారు. జాతీయ చిహ్నాలు, రాష్ట్ర చిహ్నాలు, జాతీయ అంతర్జాతీయ స్థాయి ప్రముఖుల చిత్రాలు, దేశభక్తుల పటములు వేయడం ప్రతి విద్యార్థి నేర్చుకోవాలన్నారు. చదువుల్లో బొమ్మలు గీయడం కూడా ఒక భాగమేనన్న విసయాన్ని గుర్తుంచుకోవాల

## క్షతగాత్రునికి ఉచిత మందులు పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రూరల్ మండలం అంపోలు గ్రామానికి చెందిన గంగు రామారావుకు కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు గాయపడి శస్త్రచికిత్స చేశారు. శస్త్ర చికిత్స వైఫల్యం కావటంతో గత కొంత కాలంగా నడవలేని స్థితిలో జీవనం సాగిస్తున్నారు. రామారావు ఆర్థికంగా వెనుకబడినవాడు కావటం, అందులోనూ మంచానికే పరిమితమై, కనీసం మందులు కొనడానికి కూడా నగదు లేకపోవటంతో దాతల సహాయం కోరారు. స్పందించిన రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, సుసరపు శ్రీలంక, జోగి రాజు ముందుకువచ్చి క్షతగాత్రునికి అవసరమైన మందులను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చేతుల మీదుగా రెడ్‌క్రాస్ ప్రాంగణంలో బుధవారం అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఏవో, మేనేజర్ సతీష్, ట్రైనింగ్ మేనేజర్ జి.రమణ, ట్రైనింగ్ సభ్యులు సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



న్నారు. కాబట్టి విద్యార్థులంతా బాగా సాధన చేయాలన్నారు. ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు మాట్లాడుతూ కవిత్వానికి గానీ గీతాలాపనకు గానీ భాషనేది ఒకటుంటుందని, కానీ ఈ చిత్రలేఖనం ప్రపంచంలో అన్ని భాషల వారికీ అర్థమౌతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయని యు.ఆదిలక్ష్మి, యందువ వెంకటరమణ, వెలగాడ రాము, ముల్లు సుజాత, పిల్లల దాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ర్యాలీ ద్వారా సమ్మెకు మద్దతు

(సత్యంన్యూస్, టెక్కలి)

దేశవ్యాప్తంగా బుధవారం జరిగిన కార్మిక సమ్మె భాగంగా టెక్కలిలో నిర్వహించిన ర్యాలీ విజయవంతంగా ముగిసిందని జిల్లా సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని, మతోన్మాదం నశించాలని, కార్మిక ఐక్యత వర్ధిల్లాలని, ఎనిమిది గంటల పని విధానమే ఉండాలని నినాదాలు చేశారు. సిఐటియు కార్యాలయం నుండి పాతబస్టాండ్ వరకు ఊరేగింపు అనంతరం సభ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి ఎల్లయ్య, భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు డొంకాన సూర్యనారాయణ, దవళ లక్ష్మీనారాయణ, రాజు, కూన ధర్మారావు, తిర్లంగి అప్పన్న, సత్తారు ఉత్తర, సంపతరావు రాజు, అంగన్వాడీ వర్కర్స్ బి.రవణమ్మ, వాణిశ్రీ, రైతుసంఘం నుండి బొడ్డేపల్లి మల్లయ్య, బగాది వాసు, కెయన్‌పియస్ నుండి బెలమర ప్రభాకర్, ఆశా నుండి వి.వెంకటరత్నం, జి.నారాయణ, గ్రానైట్, వాటర్, పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



### వైకాపా యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూర్యారావు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)



వైకాపా యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కేశవరావుపేటకు చెందిన కొత్తకోట సూర్యారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ వైకాపా బలోపేతానికి క్షేత్ర స్థాయిలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈమేరకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నీచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ: వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# బూత్ లెవెల్ ఆఫీసర్ శిక్షణ తరగతులు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో భారత ఎన్నికల సంఘం – ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్మెంట్ ఆదేశాల మేరకు రెండో రోజు బుధవారం శ్రీకాకుళం నియోజక వర్గంలోని పోలింగ్ కేంద్రం 51 నుంచి 100 వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణ (ఎలక్టోరల్ మేనేజ్మెంట్) శిక్షణ కార్యక్రమం రెవిన్యూ గెస్ట్‌హౌస్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఓటర్ల జాబితా, క్లెయిమ్స్, బిఎల్ఓ అప్లికేషన్, ఈసిఐ వెబ్‌సైట్‌పై అవగాహన, శిక్షణ కల్పించారు. బూత్ లెవెల్ అధికారులకు ఆన్‌లైన్‌లో ఈసీఐ ద్వారా పరీక్ష నిర్వహించారు. ఈ శిక్షణలో జి.కె.శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, శ్రీకాకుళం, రాజశేఖర్, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

# దబ్బపాడులో 'తొలి అడుగు'

(సత్యంన్యూస్, పాతపట్నం)

పాతపట్నం నియోజకవర్గం ఎల్ఎన్ పేట మండలం దబ్బపాడు గ్రామంలో సుపరిపాలనలో – తొలి అడుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తెలుగుదేశంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తుల నుంచి నేరుగా సమస్యలపై అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో ప్రజల హక్కులను కాలరాశారని, జగన్ ప్రభుత్వంలో పేదలకు అన్యాయం జరిగిందని, జగన్ నియంత్రత్వంతో రాష్ట్రం అభివృద్ధిలో అధోగతి పాలయిందని ఆరోపించారు. అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు చక్కదిద్దుతూనే పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో తాము గడపగడపకు తిరుగుతున్నప్పుడు ప్రజల నుంచి లభించిన ఆదరణ ఇప్పుడు కూడా లభిస్తుందని, తమకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, మండల క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 10న గురుపౌర్ణమి వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొండేటివీధిలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో, శ్రీ లలితాదేవి సహిత శివకామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు మొండేటివీధి శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయి సేవా సంఘం, శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆషాఢ శుక్లపక్ష పౌర్ణమిని గురుపౌర్ణమి లేదా వ్యాసపౌర్ణమి అని అంటారని, ఈ పవిత్రమైన రోజున తమ జీవితానికి మార్గనిర్దేశం చేసిన గురువులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకుంటారని తెలిపారు. హిందూ మతంలో గురువును భగవంతునికి, భక్తునికి మధ్య సంధానకర్తగా భావిస్తారని వివరించారు. హిందువులు గురుపౌర్ణిమ నాడు సాయిబాబాను కూడా ఆరాధించి పూజలు చేస్తారని, ఈ పవిత్రమైన రోజున బాబా ఆలయాలన్నీ కిటకిటలాడుతాయన్నారు. ఇదే రోజు శక్తివంతమైన ఇంద్రయోగం ఏర్పడుతుందని, ఈ యోగ సమయంలో ఏ శుభకార్యం చేపట్టినా అది విజయవంతమవుతుందని తెలిపారు.

### పాలాభిషేకం, ప్రత్యేక పూజలు

ఈ నెల 10న గురువారం పూర్ణిమ తిథి ఉదయం 1:36 గంటలకు ప్రారంభమై, 11న ఉదయం 2:06 గంటలకు ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా షిరిడి సాయిబాబాకు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ప్రత్యేక పాలాభిషేకం ఉంటుందని, సాయంత్రం 6 గంటలకు భక్తి సంగీత విభావరి కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే శ్రీ లలితా దేవి అమ్మవారి పౌర్ణమి పూజ, గురుపౌర్ణమి రోజున సాయంత్రం 6 గంటలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పౌర్ణమి పూజా ఉంటుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

## మధ్యవర్తిత్వమే వివాదాలకు మార్గం

✦త్వరిత పరిష్కారానికి ఉపయుక్తం

✦జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

న్యాయ వ్యవహారాల్లో మధ్యవర్తిత్వం ద్వారా త్వరితంగా పరిష్కారం సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు సమావేశ భవనంలో నిర్వహించిన మధ్యవర్తిత్వ న్యాయవాదుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదులు మధ్యవర్తిత్వ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలుచేయాలని సూచించారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించేందుకు ఇది మేలైన మార్గమని చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా ఇరు పక్షాలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. శిక్షణలో సీనియర్ న్యాయవాది వి.పీ. తనకచన్, న్యాయవాది పి.జి. సురేష్‌లు మధ్యవర్తిత్వ విధానం, దాని ప్రయోజనాలు, జాగ్రత్తలు వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.హరిబాబు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# 200 కంపెనీలకు మెయిళ్లు

- వైకాపా కుట్రలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

(సత్యంన్యూస్, అమరావతి)

ఏపీకి పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు వైకాపా చేస్తున్న కుట్రలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా వివిధ సంస్థలకు మెయిళ్లు పెట్టడాన్ని సీఎం తీవ్రంగా పరిగణించారు. పెట్టుబడులను అడ్డుకునేందుకు వైకాపా చేస్తున్న కుట్రలను మంత్రివర్గ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. ఏపీఎండీసీ బాండ్లలో పెట్టుబడులు పెట్టొద్దని 200 కంపెనీలకు ఈ–మెయిళ్లు పెట్టారని తెలిపారు. వైకాపా కుట్రలపై విచారణకు ఆదేశిస్తామని మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు.

### మంత్రులు సంతృప్తికరంగా పనిచేయడం లేదు

మంత్రులెవరూ సంతృప్తికరంగా పనిచేయడం లేదని మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళా ఎమ్మెల్యేను కించపరిస్తే ఎందుకు స్పందించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జరుగుతున్న పరిణామాలపై ప్రతి మంత్రీ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏడాది వ్యవధిలో నిత్యావసరాల ధరలు గణనీయంగా తగ్గించామని సీఎం చెప్పారు. ప్రజలకు లబ్ధి చేకూర్చడంలో మంత్రివర్గ ఉపసంఘం బాగా కృషి చేసిందన్నారు. చేసిన మంచిని ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యారని చంద్రబాబు ఆక్షేపించారు. జగన్ కుట్రలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలన్నారు.



# ప్రాణం ఖరీదు రూ.4 లక్షలు?!



(మొదటిపేజీ తరువాయి)

వివాహమైంది. గర్భం దాల్చిన ఆమె కూడా కన్నవారింటికి వచ్చింది. ధనలక్ష్మికి ఈ నెల 23, అరుణకు ఆ నెల 28న డెలివరీ డేట్ ఇచ్చారు. అయితే పురిటి నొప్పులు రావడంతో ముందుగానే వారిని బుడితి సీహెచ్‌సీలో చేర్పించారు. ఈ నెల ఏడో తేదీ(సోమవారం)న మధ్యాహ్నం సిజేరియన్ చేయగా వారిద్దరూ మగశిశువులకు జన్మనిచ్చారు. శిశువులు ఆరోగ్యంగానే ఉన్నా.. వారి తల్లులు మాత్రం ఆపరేషన్ తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. పరిస్థితి విషమించడంతో సిబ్బంది వైద్యురాలికి సమాచారం ఇచ్చారు. పరీక్షించిన డాక్టర్ శోభారాణి యూరిన్ బ్లాడర్‌లో సమస్య ఉందంటూ ఇద్దరినీ శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఆ విషయం బాలింతల బంధువులకు చెప్పి సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు అంబులెన్స్‌లో శ్రీకాకుళానికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు వారికి అంతర్గతంగా బ్లీడింగ్ అవుతోందని, యూరిన్ బ్లాడర్ బ్లాక్ అయిందని గుర్తించి ఇద్దరు బాలింతలకు మంగళవారం గర్భసంచులు తొలగించారు. అనంతరం ఇద్దరిని వెంటిలేటర్స్‌పై ఉంచి చికిత్స అందించారు. అయితే అప్పటికే వారిలో ఒకరి శరీరంలో కిడ్నీలు, ఇతర అవయవాలన్నీ పనిచేయడం మానేశాయి. మరో మహిళకు కార్డియాక్ అరెస్టు కావడంతో సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. చివరికి ఇద్దరూ మృతి చెందినట్టు ప్రకటించిన రిమ్స్ వైద్యులు మృతదేహాలను అంబులెన్స్‌లో బుడితి సీహెచ్‌సీకి బుధవారం తెల్లవారుజామున పంపించేశారు.

### రాయ'బేరం'

ఈ విషయం తెలుసుకున్న బాధిత కుటుంబాలు, వారి బంధువులు, గ్రామస్తులు సారవకోట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే తమవారిని కోల్పోయామని ఆరోపిస్తూ అక్కడే ఆందోళనకు దిగారు. రిమ్స్ నుంచి అంబులెన్స్‌లో వచ్చిన మృతదేహాలను ఇళ్లకు తీసుకువెళ్లడానికి నిరాకరించి పోలీసుస్టేషన్ వద్ద బైఠాయించారు. వివాదం తీవ్రమవుతున్న తరుణంలో పోలీసులు, గ్రామపెద్దలు కలిసి బాధిత కుటుంబ సభ్యులను నచ్చజెప్పి వైద్యులతో మాట్లాడి తలా రూ.4 లక్షలు పరిహారం ఇప్పించేలా రాజీ కుదిర్చారని ప్రచారం జరుగుతోంది. వివాదం పెద్దది కాకుండా పోలీసులే మధ్యవర్తిత్వం వహించి వ్యవహారాన్ని చక్కబెట్టినట్టు విశ్వసనీయ సమాచారం. పరిహారం ఇవ్వడానికి వైద్యురాలి బంధువులు అంగీకరించడంతో బాధితులు ఆందోళన విరమించి మృతదేహాలను తీసుకెళ్లారంటున్నారు.

### కొత్త డాక్టర్ వచ్చిన కొద్దిరోజులకే..

బుడితి సీహెచ్‌సీలో రెండువారాల క్రితం వరకు సృజన వైద్యురాలిగా పనిచేశారు. ఆమె హయాంలో ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా ఉండటంతో.. చుట్టుపక్కల గ్రామాల నుంచి గర్భిణులను ప్రసవాలకు ఇక్కడికే తీసుకొస్తున్నారు. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో డాక్టర్ సృజన స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా కురపాం నుంచి డాక్టర్ శోభారాణి ఇక్కడికి వచ్చారు. కొద్దిరోజులకే ఈ దారుణం జరిగింది. ఇప్పటి వరకు ఈ సీహెచ్‌సీ పరిధిలో మాతృ మరణాలు జరగలేదని స్థానికులు చెబుతున్నారు. కొత్త డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని ఆరోపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించిన ఈ ఘటనపై కలెక్టర్ స్పందించారు. విచారణ జరిపి తక్షణమే నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వో అనితను ఆదేశించడంతో ఆమె బుడితి సీహెచ్‌సీని సందర్శించి వైద్యులు, సిబ్బందిని విచారించి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

## ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

(సత్యంన్యూస్, పలాస)

పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు రూ.4200 కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఉన్నత చదువులు చదువుకోవడానికి అడ్డుగా ఉన్న జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్), పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి మాట్లాడుతూ గత ఏడాది నుంచి ఇప్పటివరకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉండడం వల్ల బీటెక్ కళాశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, బీటెక్ కంప్లీట్ అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం నుంచి రానందున ఆ ఫీజు చెల్లించాలని విద్యార్థులను కాలేజీ యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో రూ. 2400 కోట్ల మేర ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు ప్రవేశపెట్టినా, ఇంతవరకు కళాశాల ఖాతాలో పడకపోవడం వల్ల రాబోయే రోజుల్లో ఎంసెట్, డిగ్రీ, పీజీ కౌన్సిలింగ్‌లు ఉన్న నేపథ్యంలో విద్యార్థులు పై చదువులు చదవాలా లేదా అనే సందిగ్ధంలో ఉన్న పరిస్థితి ఉందన్నారు. వీటిపై రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాయి, జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, సమితి సభ్యులు సోమేశ్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



### కుంభా, దాసన్నలను కలిసిన బాబా, గిరిబాబు



(సత్యంన్యూస్, పలాస)

వైకాపా జిల్లా పరిశీలకలు కుంభా హరిబాబు, వైకాపా జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్‌ను బుధవారం స్థానిక ఆ పార్టీ సీనియర్ నాయకులు దువ్వాడ శ్రీధర్‌బాబా, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు వర్గం మర్యాద పూర్వకంగా కలిశారు. పలాసలో వైకాపా కార్యక్రమానికి వచ్చిన వారిని లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద హరిబాబు, దాసన్నను కలిసి దుశ్సాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాసలో వైకాపాకు సమర్ధవంతమైన నాయకత్వం కావాలని కోరారు. వైకాపాకు విధేయుడిగా ఉంటూ జగనన్నకు అభిమానిగా పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసే వ్యక్తిని గుర్తించి పార్టీ పగ్గాలు అప్పగించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకునిపోయే నాయకత్వం పలాస నియోజకవర్గానికి అవసరమని వివరించారు. పార్టీ నాయకులును కలిసిన వారిలో ఎం.భాస్కరరావు, వల్లభ వైకుంఠరావు, గొర్లె వేణు, హేమాచలం, వాసు, జింగా రామనరేష్, జి.కృష్ణారావు ఉన్నారు.

### ట్రిపుల్ ఐటీ బ్రాంచ్ కేటాయింపుల్లో బాలికల హవా

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళంలో బుధవారం ఇంజినీరింగ్ బ్రాంచ్ కేటాయింపు కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 1,020 సీట్లు ఉండగా, మొదటి ఐదు ర్యాంకులు బాలికల ఖాతాలోకి వెళ్లాయి. మొదటి ర్యాంకర్ చల్లా ప్రీతి ఈఈఈ బ్రాంచ్ ఎంపిక చేసుకోగా, రెండో ర్యాంకర్ బి.నిఖిల ఎలక్ట్రానిక్స్ తీసుకుంది. మూడో ర్యాంకర్ పి.సింధు, నాలుగో ర్యాంకర్ ఎ.నందిని ఇద్దరూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ఎంపిక చేసుకున్నారు. ఐదో ర్యాంకర్ కే.లక్ష్మి మాధుర్య కంప్యూటర్ సైన్స్ తీసుకుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆచార్య కేవీజీడీ బాలాజీ, ఏఓ డాక్టర్ రామకృష్ణ ముని, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి సీఎచ్ వాసు, డీన్ వెల్ఫేర్ డాక్టర్ గేదెల రవి, మోహనకృష్ణ చౌదరి విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కో–కన్వీనర్లు కె.రమణ, కోడా దిలీప్‌కుమార్, వి.సాగర్, శాఖాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.